
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

బుధవారం 6 మార్చి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర: 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.145	215	244
సూర్యాపేట	రూ.155	220	250
నల్లగొండ	రూ.160	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 24.2



ప్రైవేట్ భవనాల్లో ఇంకెన్నాళ్లు



- కోట్ల రెవెన్యూ ఉన్నా సొంత భవనాలు కరువు
- ఉమ్మడి రాష్ట్రంలో కోదాడ, మోత్కూరు, నకిరేకల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకే భవనాలు
- సౌకర్యాలు లేక దెబ్బతింటున్న డాక్యుమెంట్లు
- ఇది 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల దుస్థితి

ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయాన్ని సమకూర్చి పెడుతున్న రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ఆయా కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఏటా ప్రభుత్వానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లతో సుమారు రూ.300 నుంచి రూ.400 కోట్ల ఆదాయం సమకూరుతోంది. అయినా సొంత భవనాలు కరువయ్యాయి. - నల్లగొండ



అధికారులు పలుమార్లు నివేదికలు సమర్పించినా స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన రాష్ట్ర శాఖ అధికారులు భవన నిర్మాణాల ఫైల్‌ను పెండింగ్‌లో పెడుతున్నారు. దీంతో సొంత భవనాలు కలగానే మిగిలిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదనేది అర్థం కాని పరిస్థితి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్ష సందర్భంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు లేవని తెలుసుకొని, ఆ పరిస్థితి ఎందుకు వచ్చిందని అధికారులను ఆరా తీశారు. వెంటనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఎక్కడెక్కడ ప్రభుత్వ కార్యాలయాలు ఖాళీగా ఉన్నాయనేది అధికారులు వెతకాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రైవేట్ కార్యాలయాల్లో సౌకర్యాలు కొరత

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని భువనగిరి, బీబీనగర్, చండూరు, చౌటుప్పల్, దేవరకొండ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, నల్లగొండ, నిడమనూరు, రామన్నపేట, సూర్యాపేట, యాదగిరిగుట్ట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఇప్పటికీ సొంత భవనాలు లేవు. దీంతో అరకొర సౌకర్యాలు నడుమనే అధికారులు ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇక ఆస్తులు క్రయ విక్రయదారులకు సౌకర్యాలు ఉండటంలేదు. వాష్ రూమ్ సౌకర్యాలతో పాటు మంచినీటి సౌకర్యం లేకపోవడం ఫర్నిచర్ లేకపోవడం కూర్చోవడానికి కనీసం కుర్చీ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయినప్పటికీ సంబంధించిన అధికారులు ఉన్న పరిస్థితులతోనే నెట్టుకుపోతున్నారు. ఇకపోతే కార్యాలయాల్లో పాత డాక్యుమెంట్లకు రక్షణ కరువైంది. గత 70 ఏళ్లకు పైగా పైబడి ఉన్న ఉర్దూ తెలుగు డాక్యుమెంట్లు కూడా ఉన్నాయి. గతంలో పాత డాక్యుమెంట్లను ఆన్‌లైన్ చేయిస్తామని అప్పటి ప్రభుత్వాలు చెప్పినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. పాత డాక్యుమెంట్లు చినిగిపోయే పరిస్థితి ఉంది. ఎంతో విలువైన ఉర్దూ డాక్యుమెంట్లు ఉన్నా పట్టించుకునే పరిస్థితి లేదు. ఉర్దూ డాక్యుమెంట్లను తెలుగులోకి అనువదించి వాటిని ఆన్‌లైన్‌లో భద్రపరచాలని గతంలో నిర్ణయించినా అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వానికి రెవెన్యూ పెద్ద ఎత్తున ఉన్నప్పటికీ ఎందుకు పట్టించుకోవడం లేదనేది విమర్శలకు తావిస్తోంది.

ప్రభుత్వానికి నివేదిక పంపాం

నల్లగొండలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం సమకూర్చాలని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ప్రభుత్వం కూడా త్వరలో సొంత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసే అవకాశాలు ఉన్నాయి. సొంత భవనం ఏర్పాటైతే ఆస్తుల క్రయవిక్రయదారులకు సౌకర్యాలు మెరుగుపడతాయి. ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిన వెంటనే నల్లగొండలో సొంతభవనాన్ని నిర్మిస్తాం.

- కోమటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, సబ్ రిజిస్ట్రార్, నల్లగొండ.

ప్రభుత్వం దృష్టిలో ఉంది

గత ప్రభుత్వం హయాంలోనే జిల్లా అధికారులు సొంత భవనాలకు సంబంధించి నివేదికలు పంపించారు. ప్రస్తుత ప్రభుత్వం త్వరలోనే నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది. గతంలో కలెక్టరేట్‌లో ఖాళీగా ఉన్న కార్యాలయంలోకి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించాలని సూచించారు.

- ఎస్.ప్రకాష్, ఉమ్మడి నల్లగొండ జిల్లా రిజిస్ట్రార్

ఉమ్మడి రాష్ట్రంలో మూడు కార్యాలయాలకే..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నల్లగొండ జిల్లాలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించేలా నిధులు కేటాయించారు. మొత్తం 15 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా కోదాడ, మోత్కూరు, నకిరేకల్‌లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను రూ.64లక్షలతో సొంత భవనాలు నిర్మించారు. ఆ తరువాత ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ప్రభుత్వం పట్టించుకోలేదు. అప్పటి హోంమంత్రి, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి మహమూద్ అలీకి కూడా నివేదికలు సమర్పించినప్పటికీ నిధులు మంజూరుకాలేదు. ఆయన కొన్నినెలల క్రితం గత ప్రభుత్వ హయాంలో నల్లగొండలో పర్యటన సందర్భంగా కూడా భవన నిర్మాణాల గురించి పరిశీలిస్తామని హామీ ఇచ్చినా నెరవేరలేదు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి కార్యాలయాలు తరలించాలని చెప్పడమే తప్ప సొంత భవనాల నిర్మాణాల కోసం నిర్ణయం తీసుకోలేదు. నల్లగొండ విషయానికి వస్తే కలెక్టరేట్‌లో కొన్ని కార్యాలయాలు ఖాళీగా ఉన్నట్టు సమాచారం. ఆ భవనాల్లోకి కేవలం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్నే తరలించేందుకు వీలుంటుంది. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం కేవలం అడ్మినిస్ట్రేషన్‌కే పరిమితమైతే తరలించవచ్చు. అయితే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ప్రజలతో అనుబంధంగా ఉంటున్నందున తరలించేందుకు వీలుపడటం లేదు.



గొర్రెల స్కాంలో అధికారులకు బిగుస్తున్న ఉచ్చు

- ఇప్పటికే చంచల్‌గూడ జైలులో వయోజన విద్య డీడీ
- డిప్యూటేషన్‌పై వెళ్లి గొర్రెలను కొనుగోలు చేసిన అధికారులు
- ఏసీబీ విచారణలో పలు విషయాలు వెలుగులోకి
- కలెక్టరేట్‌లో ఫైళ్ల క్లియరెన్స్ ఇక కష్టతరమే

నల్లగొండ, మార్చి 5: గొర్రెల స్కాంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో పాటు జిల్లా పశుసంవర్ధక శాఖలో పాత్రధారులైన అధికారులకు ఉచ్చు బిగుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గొర్రెల కొనుగోళ్లు, బిల్లుల చెల్లింపు విషయంలో అవినీతి జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కో రైతు నుంచి 10నుంచి 12యూనిట్ల గొర్రెలు మాత్రమే కొనుగోలు చేయాలి. కానీ, నల్లగొండలో మాత్రం అందుకు విరుద్ధంగా దళారుల నుంచి పెద్ద మొత్తంలో యూనిట్లను కొనుగోలు చేసిన అధికారులు చిక్కుల్లో పడ్డారు. రాష్ట్రస్థాయిలో ఒక కీలకమైన ప్రజాప్రతినిధితో పాటు ఓ ఉన్నతాధికారి సూచనతో ఈ అవినీతికి తెరతీసినట్టు సమాచారం. కొద్ది రోజుల క్రితం ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసిన నలుగురు అధికారుల్లో నల్లగొండ వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ సంగు గణేష్ కూడా ఉన్నారు. అరెస్టు తరువాత ఆయన్ను బాధ్యతల నుంచి తప్పించడమే గాక, ఆయన స్థానంలో యాదాద్రి జిల్లాకు చెందిన ఓ అధికారికి డీడీగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీనికి తోడు వయోజన విద్యలో కీలకమైన సెక్షన్ పనులను నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతికి కేటాయించారు. ఇక ఏసీబీ అధికారులు మూడు రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారించగా, నల్లగొండకు చెందిన వయోజన విద్య అధికారి గణేష్ పలు కీలకమైన అంశాలు ఏసీబీ అధికారులకు చెప్పినట్టు వినికిడి. ప్రస్తుతం ఆయన చంచల్‌గూడ జైలులో ఉన్నారు.

డిప్యూటేషన్‌పై వెళ్లిన అధికారులపైనా విచారణ?

గత ప్రభుత్వం గొర్రెల కొనుగోళ్ల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు పశుసంవర్ధక శాఖ అధికారులతో పాటు ఇతర శాఖలకు చెందిన అధికారులకు సైతం బాధ్యతలు అప్పగించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు నల్లగొండ జిల్లాలోని వివిధ కీలకమైన శాఖలకు చెందిన ఉన్నతాధికారులు గొర్రెల కొనుగోళ్లలో ప్రధాన పాత్ర పోషించారు. అందులో పలువురు దళారుల వద్దే గొర్రెలను సేకరించే విషయంలో ఉత్సాహం చూపినట్టు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. నల్లగొండ జిల్లాలో 1,066 యూనిట్ల ఫైలు ప్రకారం సుమారు రూ.15కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అందులో రూ.12కోట్ల మేర దళారులకే చెల్లించాల్సి రావడం వివాదాస్పదంగా మారింది. ఈ విషయాన్ని అప్పటి నల్లగొండ జిల్లా కలెక్టర్ కర్ణన్ పరిశీలించి ఫైల్‌ను పక్కన పెట్టారు. అదేవిధంగా ప్రస్తుత కలెక్టర్ హరిచందన సైతం ఫైల్‌ను స్టడీ చేయాల్సి ఉందని పశుసంవర్ధకశాఖ అధికారులకు స్పష్టం చేశారు. ఆ ఫైల్‌తోపాటు జరిగిన పొరపాట్లను, అక్రమాలను, అవినీతిని గ్రహించినట్టు విశ్వసనీయ సమాచారం. ఇక ఆ ఫైల్‌కు మోక్షం కలిగే ప్రసక్తి లేదని పశుసంవర్ధక శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై వెళ్లిన అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. వారిని కూడా త్వరలోనే ఏసీబీ అధికారులు విచారించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. వారందరినీ విచారిస్తే అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో తేలే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫైల్ పెండింగ్ విషయంపై పశుసంవర్ధకశాఖ జేడీ సుబ్బారావును పలుమార్లు 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఫైల్ కలెక్టరేట్‌లోనే పెండింగ్‌లో ఉందని స్పష్టం చేస్తున్నారు. అయితే ఆ ఫైల్‌లో ఉన్న అంశాల గురించి మాత్రం తనకు తెలియదని చెబుతున్నారు. ప్రధానంగా నల్లగొండ జిల్లాలో 1,172 నకిలీ ఇన్‌వాయిస్‌లకు చెల్లింపులు చేసినట్టు కాగ్ నివేదికలో వెల్లడించింది. మొత్తానికి వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ గణేష్ అరెస్ట్ కావడం జైలుకు వెళ్లడంతో పాటు ఇటీవల ఏసీబీ అధికారుల కస్టడీలో ఎలాంటి విషయం వెల్లడించారనే దానిపై జిల్లా అధికారుల్లో భయాందోళన మొదలైంది.

చేనేత వ్యాపారులకు రుణాలు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ కే.నిఖిల



చేనేత కార్మికులు, ప్రతినిధులతో సమావేశమైన ఆర్‌బీఐ డైరెక్టర్ కే నిఖిల

భూదాన్‌పోచంపల్లి, మార్చి 5: చేనేత కార్మికులు, వ్యాపారులకు తమ వ్యాపారాభివృద్ధికి వివిధ పథకాల్లో భాగంగా బ్యాంకులు రుణాలు అందించి ప్రోత్సహిస్తున్నాయని రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా డైరెక్టర్ కే.నిఖిల అన్నారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లిలోని పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ హాల్‌లో వివిధ బ్యాంకుల సౌజన్యంతో లీడ్ బ్యాంకు యాదాద్రి ఆధ్వర్యంలో చేనేత కార్మికులు, వ్యాపారులకు, చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల వ్యాపారులతో బ్యాంకుల్లో వివిధ పథకాలతో లబ్ధిపొందే విధంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చేనేత కార్మికులు బ్యాంకుల్లో రుణాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆమె చర్చించారు. చేనేత రంగంలోని కార్మికులు, బ్యాంకుల్లో డిజిటలేషన్ బ్యాంకుపై అవగాహన కల్పించారు. తమ వ్యాపారాభివృద్ధిలో రుణాలను అందించడంలో బ్యాంకులు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటాయన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం చిన్న తరహా పారిశ్రామికులు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆమె సందర్శించారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ డీజీఎం టీ.జగదీష్, ఆర్‌బీఐ ఎంజీఎస్ గోమతి, లీడ్ బ్యాంకు మేనేజర్ రామకృష్ణ, కెనరాబ్యాంకు డివిజన్ మేనేజర్ వి.శ్రీనివాసరావు, ఎస్‌బీఐ డీఎం ఖరీమున్నీసాగాబీరీ, ఏబీఆర్ డీడీఎం వినాగ్ కుమార్, ఆర్‌బీఐ ఎల్‌డీవో వైభవ్ వ్యాస్, లీడ్ బ్యాంకు మేనేజర్ పవన్‌కీర్తి, ఆర్‌బీఐ అధికారి తాన్యా సంగ్మా, పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, గౌరవ అధ్యక్షుడు కర్నాటి బాలరాజు, ఉపాధ్యక్షుడు ఈపూరి ముత్యాలు, ప్రధాన కార్యదర్శి మునుకూరి నర్సింహ, ప్రతినిధులు వనం దశరథ, మంగళపల్లి రమేష్, సీత కృష్ణ, సీత భవాని, కడవేరు సత్యనారాయణ, పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు గంజి యుగంధర్, కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు మంగళపల్లి శ్రీహరి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య
- వేదికపై జడ్పీచైర్మన్, ఎమ్మెల్యే మందుల సామేలు వాగ్వాదం
- జడ్పీ సమావేశంలో సమస్యలపై గళం విప్పిన సభ్యులు



జడ్పీ సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హన్మంత్ కె జెండగే, పక్కన జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

భువనగిరి రూరల్, మార్చి 5: సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. జడ్పీ కార్యాలయంలో మంగళవారం జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సర్పంచ్‌లు లేని కారణంగా ప్రజల సమస్యలు పరిష్కరించే బాధ్యత అందరిపై ఉందన్నారు. అధికారులు తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. వేసవిలో నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నీటి సమస్య పరిష్కారానికి నియోజకవర్గానికి రూ.2కోట్ల నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయన్నారు. అదేవిధంగా ఏక కాలంలో రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ప్రొటోకాల్ పాటించడంలో అధికారులు చేస్తున్న పొరపాట్లను ఉపేక్షించబోమన్నారు. ఇటీవల గుండాల మండలంలో మాజీ ప్రతినిధుల పేర్లతో శిలాఫలకాలను ఏర్పాటు చేయడం సరికాదన్నారు. జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులకు సంక్షేమ పథకాలు అందించడంతోపాటు అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను ఎన్నికల కోడ్ రాక ముందే పూర్తి చేయాలన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ మాట్లాడుతూ అధికారులు గత ప్రభుత్వ పద్ధతులను మార్చుకోవాలన్నారు. గత ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయక ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లయితే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. తమ నియోజకవర్గంలో మంచి నీటి సమస్య పరిష్కారానికి కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేయించి ప్రజల నీటి సమస్యలను పరిష్కరించాలన్నారు. నాలుగేళ్లుగా అసంపూర్తిగా నిలిచిన కాటేపల్లి-మోత్కూరు రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయించాలని ఆర్‌అండ్‌బీ ఈఈ శంకరయ్యను ఆదేశించారు. కలెక్టర్ హనుమంతు కే.జెండగే మాట్లాడుతూ సంక్షేమ పథకాలను పేదలకు అందించేందుకు అధికారులు పారదర్శకంగా పని చేయాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని, అర్హులు లబ్ధిపొందేందుకు జిల్లాలోని ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామని ప్రజలు దరఖాస్తు చేసుకునే విధంగా ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు.

వేదికపై జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు మధ్య వాగ్వాదం

సమావేశంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసి పోయిందని..., రాళ్లు, గుట్టలు, ప్లాట్లకు రైతుబంధు ఇచ్చారని, ఆర్టీసీని నిర్వీర్యం చేశారని ఎమ్మెల్యే తీవ్ర స్థాయిలో ఆరోపించడంతో జడ్పీచైర్మన్ అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఇది ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల పురోగతి, అమలు సమీక్షా సమావేశమని, దీనిని రాజకీయ సభగా మలుచుకొని జిల్లా పరిషత్‌ను అవమానపర్చడం సరికాదన్నారు. దీంతో వారిద్దరి మధ్య కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొన్నది. రైతుల సమస్యలు, సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బదులిచ్చారు. ఆరు గ్యారంటీలను అమలుచేసి తీరుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జడ్పీ వైస్‌చైర్మన్ ధనావత్ బీకూనాయక్, జడ్పీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ కుడుదుల నగేష్, పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు ఆయా మండలాల పరిధిలో నెలకొన్న సమస్యలపై గళం విప్పారు. నీటి సమస్య, అసంపూర్తి నిర్మాణాలు, సంక్షేమ పథకాల అమలులో జాప్యం, మిషన్ భగీరథ నీరు కలుషితం, గ్రామాల్లో బెల్ట్‌షాపుల నివారణ తదితర అంశాలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యేగా గెలుపొంది మొదటిసారిగా సమావేశానికి హాజరైన మందుల సామేలును ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి సన్మానించారు. సమావేశంలో జడ్పీ సీఈవో ఎన్.శోభారాణి, డిప్యూటీ సీఈవో విష్ణువర్ధన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతుకు సాగునీటి కష్టం



నాగిరెడ్డిపల్లిలో వరి చేనుకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని పోస్తున్న రైతు వెంకటేశ్

భువనగిరి రూరల్, మార్చి 5: కరెంట్ సరఫరాలో అంతరాయం, భూగర్భజలాలు అడుగంటుతుండడంతో రైతులకు సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. మండలంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన కౌలు రైతు కాసాని వెంకటేష్ రెండు ఎకరాలను కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటున్నాడు. అయితే 15 రోజుల నుంచి ఎండలు తీవ్రమవుతుండడం, కరెంట్ సరఫరా సక్రమంగా లేకపోవడం, భూగర్భజలాలు అడుగంటి రెండు బోర్లలో నీరు సక్రమంగా పొలాల్లోకి రాకపోవడంతో ఎకరం పొలం ఎండిపోయింది.

కాగా గత్యంతరంలేని పరిస్థితుల్లో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసుకుంటున్నాడు. అయితే ఒక్కో ట్యాంకర్‌కు రూ.1000 చొప్పున మంగళవారం ఉదయం రెండు, సాయంత్రం రెండు ట్యాంకర్లు ఇలా రోజుకు నాలుగు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తూ.., ఉన్న ఎకరం పొలాన్ని సంరక్షించుకుంటున్నాడు. ఇంకా నెల గడిచినట్లయితే తమ పంట చేతికివస్తుందని చెబుతున్నాడు. ఈ ప్రాంత రైతులకు సాగునీటిని అందించే విధంగా పాలకులు కృషి చేయాలని కౌలు రైతు విజ్ఞప్తి చేస్తున్నాడు.

శాస్త్రోక్తంగా మహాశివరాత్రి పర్వాలకు శ్రీకారం

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట, మార్చి 5: హరిహరక్షేత్రంగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో అనుబంధ ఆలయమైన పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అర్చకబృందం మంగళవారం శైవాగమ శాస్త్రరీతిలో మహాశివరాత్రి పర్వాలకు శ్రీకారం చుట్టింది. సకల విఘ్నాలకు అధిపతి విఘ్నేశ్వరుడికి తొలి పూజతో అర్చకులు, వేదపండితులు, రుత్వికులు మహాశివరాత్రి వేడుకలను సంప్రదాయరీతిలో ఆరంభించారు. ముందుగా శివాలయ ప్రధానాలయంలోని గర్భగుడిలో కొలువుదీరిన రామలింగేశ్వరస్వామిని ఆరాధించిన పూజారులు ఆవరణలో ఉదయం 10.30 గంటలకు శుద్ధిపుణ్యాహవాచన పూజలు నిర్వహించారు. మంత్రించిన జలాలతో శివాలయం, ఆలయ పరిసరాలను శుద్ధి చేశారు. స్వామి, అమ్మవార్లకు రక్షసూత్రాలను ధరింపజేసిన పూజారులు నిర్వాహకులకు కంకణధారణ చేశారు. అనంతరం దేవస్థాన అధికారులు రుత్వికులకు, అర్చకస్వాములకు దీక్షవస్త్రాలను అందజేశారు. సర్వ విఘ్నాలను తొలగించి వ ఃహోత్సవాలు దిగ్విజయం చేసేందుకు విఘ్నాధిపతిని ప్రార్థిస్తూ చేపట్టే విశేష పర్వమే విఘ్నేశ్వర పూజ అని, పరమేశ్వరుడి అనుగ్రహంతో సకల లోకాలు సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ నిర్వహించే వేడుక స్వస్తి పుణ్యాహవాచనమని, మంత్రించిన జలంతో స్థల, ద్రవ్య, సమస్త వస్తువులను శుద్ధిచేయడమే శుద్ధి పుణ్యాహవాచనమని ఆచార్యులు వివరించారు. సాయంత్రం వేళ నమక, చమక, రుద్ర, మంత్ర పుష్ప పఠనాలతో అంకురారోపణ, సోమకుంభకలశ స్థాపన, సమస్త దేవతారాధన వైదిక పర్వాలు వైభవంగా కొనసాగాయి. ఈ ఆధ్యాత్మిక పర్వాలను దేవస్థాన ప్రధాన పురోహితుడు గౌరీభట్ల సత్యనారాయణశర్మ, శివాలయ ప్రధానార్చకుడు గౌరీభట్ల నరసింహరామశర్మ, అర్చకబృందం నిర్వహించగా, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి దంపతులు, ఈవో ఎం.రామకృష్ణారావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో రఘు, సిబ్బంది పాల్గొన్నారు.



శివాలయంలో స్వస్తిపుణ్యావాచన పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

క్షేత్రపాలకుడికి శాస్త్రోక్తంగా నాగవల్లీ దళార్చనలు

యాదగిరీశుడి సన్నిధిలో మంగళవారం క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి, అనుబంధ పాతగుట్ట ఆలయం, కొండపైన శివాలయంలో కొలువైన ఆంజనేయస్వామిని అర్చకస్వాములు వేదమంత్రాలతో పంచామృతాభిషేకం చేసి సింధూరం, వివిధ రకాల పూలమాలలతో అలంకరించారు. ఆంజనేయుడి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు ని ర్వహించారు. అంజనేయస్వామికి బూరెలు, వడలు, బెల్లంపానకం, వడపప్పు,అరటి పండ్లు నివేదించి వితరణ చేశారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపి, నిజాభిషేకం, నిత్యార్చనలు, అష్టభుజి ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.14,92,242 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

మేడిగడ్డ ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టాలి

భువనగిరి అర్బన్, మార్చి 5: జిల్లాలో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోగా, వెంటనే చెరువులు, కుంటలు నింపాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని భువనగిరి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి డిమాండ్‌చేశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ హనుమంతు కే.జెండగేకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 17మండలాల్లో రైతులకు పూర్తిగా నష్టపోతున్నారని, ఇకనైనా ప్రభుత్వం వెంటనే మేల్కొని భూగర్భజలాలు పెంచేందుకు కృషి చేయాలన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో భువనగిరి మాజీ మునిసిపల్ చైర్మన్ పెంట నరసింహ, కొండ స్వామి, మందడి జితేందర్‌రెడ్డి, గోమారి సుధాకర్‌రెడ్డి, అందె శంకర్, తాడెం రాజశేఖర్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డికి గుడి

● అభిమానం చాటుకున్న వీరాభిమాని సంతోష్

● ఈ నెల 19న నల్లగొండ జిల్లా వనిపాకలలో భూమిపూజ



వనిపాకలలో సీఎంకు గుడి నిర్మాణం చేసే స్థలాన్ని చూపుతున్న మేడి సంతోష్

చిట్యాలరూరల్, మార్చి 5: తమకు నచ్చిన నాయకులపై ఏదో ఒక రకంగా అభిమానం చాటుకుంటుంటారు అభిమానులు. వారిని దేవుడిలా కొలుస్తుంటారు. అదే కోవకు చెందిన ఓ వీరాభిమాని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి గుడి కట్టించాలని నిర్ణయించుకున్నాడు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వనిపాకల గ్రామానికి చెందిన మేడి సంతోష్ సీఎం రేవంత్‌రెడ్డికి వీరాభిమాని. రేవంత్‌రెడ్డి ఇతర పార్టీల్లో ఉన్నప్పటి నుంచీ ఆయనపై సంతోష్ ఎంతో అభిమానం పెంచుకున్నాడు. కాంగ్రెస్ పార్టీలో రేవంత్‌రెడ్డి చేరడంతో ఆ అభిమానం మరింత పెరిగింది. రియల్ ఎస్టేట్ చేసే ఆయన తాను నివాసం ఉంటున్న ఇంటి ఎదుట సొంత స్థలంలో సీఎం రేవంత్‌రెడ్డికి గుడి కట్టాలని మంగళవారం నిర్ణయించుకున్నాడు. అందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. ఈ సందర్భంగా సంతోష్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి అంటే తనకు చాలాకాలంగా ఎంతో అభిమానమన్నారు. కనిపించని దేవుడి కంటే కనిపించే దేవుడిలా భావిస్తూ ప్రజల కోరికలు తీర్చుతున్నారని కొనియాడారు. ప్రజల కష్టాలను తెలుసుకుని వాటిని తీర్చేందుకు శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడంతోనే ఆరు గ్యారెంటీల్లో ప్రమాణస్వీకారం చేపట్టగానే రెండింటిని అమలు చేశారని, ఈ మధ్యనే మరో రెండింటిని అమలు చేసి నాలుగు గ్యారెంటీలను ప్రజలకు కానుకగా ఇచ్చారన్నారు. రేవంత్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో ఆయన్ను దేవుడిలా కొలుస్తూ గుడిని నిర్మించనున్నానని అందుకు ఈ నెల 19వ తేదీన గుడి నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు తెలిపాడు. సీఎం రేవంత్‌రెడ్డిపై తనకున్న అభిమానంతో ఆయన్ను దేవుడిలా కొలుస్తూ గుడిని నిర్మించేందుకు నిర్ణయించుకున్నానని, ఈ అవకాశం తనకే దక్కడం ఆనందంగా ఉందని సంతోష్ తెలిపాడు. సంతోష్ తండ్రి మేడి యాదయ్య కాంగ్రెస్ పార్టీ నాయకుడు. ఆయన్ను స్థానికంగా 'ఎమ్మెల్యే యాదయ్య' అని పిలుస్తుంటారు.

'మహా'జాతరకు సర్వంసిద్ధం

● రేపు సాయంత్రం నుంచి జాతర ప్రారంభం ● పూర్తయిన ఏర్పాట్లు ● ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ ప్రభలు
● ఎద్దుల పోటీలకు ముమ్మర ఏర్పాట్లు ● ఆకట్టుకోనున్న సాంఘిక, పౌరాణిక నాటకాలు



వేడుకలకు సిద్ధమైన శంభులింగేశ్వరస్వామి ఆలయం

మేళ్లచెర్వు, మార్చి 5: మహాశివరాత్రి సందర్భంగా మండలకేంద్రంలోని ఇష్టకామేశ్వరి సమేత, స్వయంభు శంభులింగేశ్వరస్వామి వారి జాతర ఈ నెల 8వ తేదీ (గురువారం) సాయంత్రం నుంచి ప్రారంభమవుతుంది. గతేడాది ఈ జాతరకు సుమారు ఐదు లక్షల మంది హాజరు కాగా... ఈ సారి ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు, తాగునీటి వసతి, ప్రత్యేక వైద్య శిబిరాలు, బారీ కేడ్లు, పార్కింగ్ స్థలాలు, క్రీడా ప్రాంగణాలు అన్ని పూర్తిచేసి, సుమారు 700 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

ఆలయ విశిష్టత

దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ఈ ఆలయం అనేక విశేషాలతో కూడుకొని ఉన్నది. మహిమ గల దేవుడిగా, భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా కొలవబడే స్వామి వారు లింగం ఆకారంలో ఉన్నారు. శివలింగం పైన రెండు వేళ్ల పట్టేంత స్థలం నుంచి గంగాజలం నిత్యం వస్తుండడం, ఎన్నిసార్లు తోడినా నీరు వస్తుండడం విశేషం. ప్రతీ 12 సంవత్సరాలకు ఒకసారి లింగం ఆకారం ఒక అంగుళం చొప్పున పెరగటం మరో విశిష్టత. అత్యంత ప్రాచీన ఆలయంగా కాకతీయుల కాలంలో 1311లో ఈ ఆలయం నిర్మించినట్లు ఆలయ ప్రాంగణంలో ఉన్న శిలాశాసనంపై లిఖించి ఉంది. సంతానంలేని దంపతులు స్వామి వారి ఆలయంలో స్నానసారం దీక్ష చేస్తే సంతానం కలుగుతుందని ఇక్కడి ప్రజల నమ్మకం. ప్రతీ మహాశివరాత్రి రోజున స్వామి వారికి ఇష్టకామేశ్వరి అమ్మవారికి అత్యంత వైభవంగా కల్యాణం నిర్వహించటం, జాతర చేయటం ఇక్కడ ఆనవాయితీ.

ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ ప్రభలు

మహా శివరాత్రి జాతరలో శివరాత్రి రోజున, ఆలయ ప్రాంగణంలో శివరాత్రికి ముందు రోజున గ్రామ కూడలిలలో నిర్మించే 100నుంచి 110 అడుగుల ఎత్తులో నిర్మించే విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఉమ్మడి రాష్ట్రంలో కోటప్పకొండ తర్వాత అంత ప్రాముఖ్యం ఈ జాతరకు ఉంది. ఈ ప్రభలను వాటి మీద ఏర్పాటుచేసే సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించడానికి ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలతోపాటుగా ఆంధ్ర ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. రాష్ట్రంలోని ప్రతిష్టాత్మకమైన ఎద్దుల పందేలు ఇక్కడ నిర్వహిస్తారు. ఎనిమిది విభాగాల్లో జరిగే ఈ పోటీల్లో 80 బహుమతులు ప్రదానం చేస్తారు. ఆలయ ప్రాంగణంలో జాతర సందర్భంగా ఇన్విటేషన్ టీంలతో ఏర్పాటుచేసే కబడ్డీ పోటీలు ఆకట్టుకునే విధంగా ఉంటాయి. జాతర ఐదు రోజులు రాత్రివేళల్లో సాంఘిక, పౌరాణిక నాటకాలతో పాటు ప్రత్యేక శిక్షణ తీసుకున్న కోలాటాలు నిర్వహిస్తుంటారు.



సిద్ధమైన ప్రభలు

అన్నదానానికి ఏర్పాట్లు

మహాశివరాత్రి జాతర ఐదు రోజులపాటు ఆలయ సమీపంలోనే టీటీడీ కల్యాణ మండపం ఆధ్వర్యంలో అన్నదానానికి ప్రభుత్వం తరఫున ఏర్పాట్లు చేస్తుండగా... దాతల సహకారంతో వీరబ్రహ్మ మఠం తరఫున దండా లింగయ్య అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కాగా... గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల ముందు మహాశివరాత్రి జాతరరావటంతో ఎమ్మెల్యేగా పోటీలో ఉన్న వారు పోటాపోటీగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కాగా.. ఈసంవత్సరం దాతలు ఎవ్వరూ ముందుకు రాకపోవటంతో ప్రభుత్వం తరఫున ఏర్పాటుచేస్తున్నారు.

రెండేళ్లలో పూర్తి చేయడమే లక్ష్యం

● పునఃప్రారంభమైన ఎస్ఎల్‌బీసీ సొరంగం, డిండి ఎత్తిపోతల పనులు ● పనులను తరచూ పర్యవేక్షిస్తున్న అధికారులు ● ప్రాజెక్టుల నిర్మాణానికి రైతులు సహకరించాలి : ఎమ్మెల్యే బాలూనాయక్





గొట్టిముక్కల రిజర్వాయర్ పనులను పర్యవేక్షిస్తున్న డిండి ఎత్తిపోతల ఎస్ఈ వెంకటేశ్వరరావు, అధికారులు, గొట్టిముక్కల రిజర్వాయర్

దేవరకొండ, మార్చి 5: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, బడ్జెట్‌లో ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయించడంతో ప్రాజెక్టుల నిర్మాణ పనులు పునప్రారంభమయ్యాయి. గత ఆరు నెలలుగా నిధుల కొరత, కోర్టు కేసులు, వివిధ కారణాలతో నిలిచిపోయిన ప్రాజెక్టుల పనులు ప్రారంభమయ్యాయి. రెండేళ్లలో ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ చెబుతున్నారు. అందుకుగాను అధికారులతో తరచూ సమావేశాలు నిర్వహించి సమీక్షిస్తుండడంతో ప్రాజెక్టుల పనులు పునః ప్రారంభమయ్యాయి. శ్రీశైలం సొరంగమార్గం.. శ్రీశైలం నుంచి తవ్వకం పనులు ప్రారంభమైనట్లు అధికారులు తెలుపుతున్నారు. నల్లగొండ జిల్లాలోని మూడున్నర లక్షల ఎకరాలకు సాగునీరు, 500 గ్రామాలకు తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రాజెక్టును ప్రారంభించారు. రూ.1925కోట్లతో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి 2005లో శ్రీశైలం సొరంగమార్గాన్ని ప్రారంభించారు. కాగా పనుల్లో తీవ్ర జాప్యం కారణంగా అంచనా వ్యయం ఇప్పటికే రూ.4,618 కోట్లకు పెరిగింది. సొరంగమార్గం మొత్తం 43.93 కిలోమీటర్లు తవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు 34.37 కిలోమీటర్లు పూర్తయింది. 9.559 కి.మీ.ల సొరంగం తవ్వితే ప్రాజెక్టు పూర్తవుతుంది. రూ.2500 కోట్లకు పైగా పనులు పూర్తయ్యాయి. 2026 జూన్ వరకు గడువు పొడిగించారు. టన్నెల్ బేరింగ్ మిషన్ మరమ్మతులకు గురికావడంతో జర్మనీ, అమెరికా దేశాల నుంచి పరికరాలను తెప్పించే పనిలో నిమగ్నమయ్యారు. మన్నెవారిపల్లి ఒకటో టన్నెల్ వద్ద పనులు నిలిచిపోగా శ్రీశైలం నుంచి సొరంగం తవ్వకం పనులను పునఃప్రారంభించినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలుపుతున్నారు.

కొనసాగుతున్న డిండి ఎత్తిపోతల పనులు

డిండి ఎత్తిపోతల పథకాన్ని 2015లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపనచేసి రెండున్నరేళ్లలో ప్రాజెక్టును పూర్తిచేసి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అందుకుగాను ప్రాజెక్టు వ్యయం రూ.6190కోట్లు కేటాయించారు. కాని భూనిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం ప్రక్రియ పూర్తి చేయకపోవడంతో భూనిర్వాసితులు ప్రాజెక్టు పనులను అడ్డుకోవడంతో తరచూ పనులు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. దీంతోపాటు ప్రాజెక్టులకు అనుమతిలేదని, కోర్టులో కేసుతో పనులు కొంతకాలంగా నిలిచిపోయాయి. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ప్రాజెక్టు పనులు పునఃప్రారంభమయ్యాయి. డిండి ప్రాజెక్టు రెండేళ్లలో పూర్తిచేస్తామని మంత్రులు, అధికారులు చెబుతున్నారు. డిండి ఎత్తిపోతల పథకంలో శివన్నగూడెం, చింతపల్లి, కిష్టరాయన్‌పల్లి, గొట్టిముక్కల, సింగరాజుపల్లి, ఉల్పర, గోకారం, ఇర్విన్ రిజర్వాయర్లను నిర్మిస్తున్నారు. వీటిలో గొట్టిముక్కల, సింగరాజుపల్లి రిజర్వాయర్ల పనులు 95శాతం పూర్తయ్యాయి. చర్లగూడెం రిజర్వాయర్ పనులు 65శాతం పూర్తయ్యాయి. చింతపల్లి, కిష్టరాయన్‌పల్లి రిజర్వాయర్ల పనులు 35శాతం పూర్తయ్యాయి. మిగతా రిజర్వాయర్ల పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. గొట్టిముక్కల రిజర్వాయర్ పరిధిలో 200 ఎకరాలకు భూపరిహారం చెల్లించాల్సి ఉంది. అందులో 130 ఎకరాలవరకు ప్రభుత్వ భూమి ఉంది. గొట్టిముక్కల, పూతల్‌రాంతండా, లింగన్నబావి భూనిర్వాసితులకు చింతపల్లి వద్ద పునరావాసం కల్పించారు. వెంకేపల్లి తండా, చర్లగూడెం, చింతపల్లి, కిష్టరాయన్‌పల్లి ముంపు ప్రజలకు పునరావాసం కల్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలో ముంపునకు గురవుతున్న ఎనిమిది గ్రామాల భూనిర్వాసితులకు పునరావాసం కల్పించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఎస్ఎల్‌బీసీకి రూ.2వేల కోట్లు, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టుకు రూ.800 కోట్లు కేటాయించి రెండున్నరేళ్లలో పూర్తిచేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నారు. గొట్టిముక్కల రిజర్వాయర్ పరిధిలో కొనసాగుతున్న ప్రొటెక్షన్‌వాల్ (రక్షణగోడ), విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పనులు, జనరేటర్, కార్యాలయ భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు ఎస్ఈ వెంకటేశ్వరరావు తెలిపారు. చర్లగూడెం, కిష్టరాయన్‌పల్లి రిజర్వాయర్ల పనులు కొనసాగుతున్నాయన్నారు. ఇటీవల గొట్టిముక్కల రిజర్వాయర్ పనులను డిండి ఎత్తిపోతల ఎస్ఈ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారులు పర్యవేక్షించారు. దీంతో ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి.

పనులు కొనసాగుతున్నాయి

డిండి ఎత్తిపోతల రిజర్వాయర్ పనులు కొనసాగుతున్నాయి. భూనిర్వాసితులందరికీ పునరావాసం కల్పించే ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రాజెక్టుల నిర్మాణానికి అందరు సహకరించాలి. ప్రభుత్వం ప్రాజెక్టుకు నిధులు కేటాయించి ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంది.

వెంకటేశ్వరరావు, ఎస్ఈ

సాగునీరు అందించడమే లక్ష్యం



డిండి ఎత్తిపోతల, నక్కలగండి, శ్రీశైలం సొరంగ మార్గం ప్రాజెక్టులను పూర్తిచేసి నియోజకవర్గానికి సాగు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు ప్రాజెక్టులపై ప్రత్యేకదృష్టి సారించారు. ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష నిర్వహించి ముందుకెళుతున్నారు. ప్రాజెక్టుల నిర్మాణానికి రైతులు సహకరించాలి. రెండేళ్లలో ప్రాజెక్టులను పూర్తిచేసి సాగు నీరు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం.

నేనావత్ బాలూనాయక్, దేవరకొండ ఎమ్మెల్యే

బాలికల ఆత్మహత్యలపై న్యాయ విచారణ జరపాలి

కవాడిగూడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): భువనగిరి హాస్టల్‌లో ఇటీవల ఇద్దరు బాలికల ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని భవ్య, వైష్ణవి న్యాయపోరాట కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నా చౌక్‌వద్ద ధర్నా చేయడానికి ప్రయత్నించగా వారికి అనుమతిలేదంటూ దోమలగూడ పోలీసులు ధర్నాను అడ్డుకున్నారు. బాధితుల కుటుంబసభ్యులు లలిత, వివిధ ప్రజాసంఘాల నాయకురాళ్లు మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఈ ఘటనపై న్యాయవిచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ధర్నా చేయడానికి వచ్చారు. 11గంటల సమయంలో అక్కడకు చేరుకున్న పోలీసులు భవ్య, వైష్ణవి న్యాయపోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు ఎలాంటి అనుమతులులేవని తేల్చిచెప్పారు. దీంతో న్యాయపోరాట కమిటీ నేతలు, బాధితుల కుటుంబసభ్యులు ఖచ్చితంగా ధర్నాచేసి తీరుతామని, తమ పిల్లలది ఆత్మహత్యకాదని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని వారు ఆరోపించారు. తమకు న్యాయం జరిగేంతవరకు ఇక్కడినుంచి కదిలేదిలేదంటూ రోడ్డుపై నిరసన తెలిపారు. వెంటనే దోమలగూడ పోలీసులు వారికి సర్దిచెప్పి 'మీకు అన్యాయం జరిగితే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలి' అని సలహా ఇవ్వడంతో వారు అక్కడినుంచి వెళ్లారు. ఈ ధర్నాకుమద్దతు తెలియజేయడానికి వచ్చిన పీఓడబ్ల్యూనేతలు సంధ్య, ఝాన్సీ, చైతన్య, మహిళా సంఘం నాయకురాళ్లు పి.జ్యోతి తదితరులు మాట్లాడుతూ వైష్ణవి, భవ్యల ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ చేసి వారి కుటుంబసభ్యులకు న్యాయం చేయాలన్నారు.



విద్యార్థినుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

ఎయిమ్స్‌లో రక్తహీనతపై పరిశోధన


● ఏప్రిల్‌లో పరిశోధనలు ప్రారంభం : డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్, మార్చి5: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని అఖిలభారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లో రక్తహీనతపై పరిశోధనలు చేయనున్నారు. భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఇండియన్ కౌన్సిల్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), ఆయుర్వేద సైన్స్ సహకారంతో అనేమియా(రక్తహీనత)పై బీబీనగర్ ఎయిమ్స్‌తోపాటు వార్ధ, జోద్‌పూర్, బెంగళూర్, రాంచీ, న్యూఢిల్లీ, భూపాల్‌లోనూ అధ్యయనం చేయనున్నట్లు ఆదివారం ఢిల్లీలో ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దేశంలో రక్తహీనత ఒక ప్రధాన ఆరోగ్య సమస్యగా మారిందని 2019-2021లో జాతీయ కుటుంబ సర్వేలో తేలింది. దాదాపు 57శాతం మంది 15నుంచి 49సంవత్సరాల వయసు గల మహిళలు రక్తహీనత సమస్యతో బాధపడుతున్నట్లు నిర్ధారణ అయింది. దీంతో భారత ప్రభుత్వం రక్తహీనత సమస్యను ప్రాధాన్య అంశంగా తీసుకుని పరిశోధనకు నిర్ణయించింది. బీబీనగర్ ఎయిమ్స్‌లో కమ్యూనిటీ మెడిసిన్, ఫ్యామిలీ మెడిసిన్ విభాగాల ఆధ్వర్యంలో ఏప్రిల్ నెలలో సంబంధిత విభాగ అధిపతి ఆర్.గోమతి నాయకత్వంలో పరిశోధనలు ప్రారంభం కానున్నట్లు ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా తెలిపారు.



బీబీనగర్ పరిధిలోని ఎయిమ్స్

ఆపరేటర్లకు అందని భత్యం



కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ(ఫైల్)

భువనగిరి టౌన్, మార్చి 5: కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో ఇప్పటివరకు నాలుగు పథకాలను ప్రభుత్వం అమలుచేసింది. ఇందుకోసం 28 డిసెంబరు 2023 నుంచి 6 జనవరి 2024 వరకు రాష్ట్రమంతటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజా పాలనలో ఆశావహులనుంచి దరఖాస్తులను స్వీకరించింది. స్వీకరించిన దరఖాస్తులను గత నెల 7 నుంచి 17 వరకు ప్రైవేట్ డాటా ఎంట్రీ ఆపరేటర్లు ప్రజాపాలన తెలంగాణ పోర్టల్‌లో నమోదు చేశారు. వడపోతల అనంతరం ఎంపికైన అర్హులు పథకాల లబ్ధిని పొందుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ ప్రజాపాలనలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఆన్‌లైన్ చేసిన ప్రైవేట్ డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ప్రభుత్వం ఇంతవరకు ఇస్తానన్న చార్జీలను మాత్రం ఇవ్వలేదు. దీంతో ఉమ్మడిజిల్లాలో ప్రజా పాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసిన ఆపరేటర్లు ప్రభుత్వ వైఖరిని తప్పుబడుతున్నారు. ఆన్‌లైన్ నమోదు పూర్తయ్యే వరకూ వెంటే ఉంటూ ఒత్తిడి చేస్తూ పని చేయించుకున్న అధికారులు అనంతరం మొఖం చాటేస్తుండడం, తాము ఆన్‌లైన్ చేసిన దరఖాస్తుల ఆధారంగానే ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసి తన హామీలను నెరవేర్చుకుంటూ తమను విస్మరిస్తుండడం పట్ల ఆపరేటర్లు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో 11,41,767 ప్రజాపాలన దరఖాస్తులను ఎంట్రీ చేసిన సుమారు 6వేల మంది ఆపరేటర్లకు రూ.57,08,835 చార్జీల రూపంలో అందాల్సి ఉంది.

ఒత్తిడితోనే పని పూర్తి

సుమారు వారం పని దినాల్లో ప్రతీ బస్తీ, ప్రతీ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలనలో స్వీకరించిన అర్జీలను సంబంధిత ప్రభుత్వ సిబ్బందే ఎంట్రీ చేయాలని మొదటగా ఉన్నతాధికారులు నిబంధన విధించారు. కానీ పలువురికి కంప్యూటర్ అవగాహన కొరవడడం మరికొందరికి కంప్యూటర్లు లేకపోవడం మరికొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సమస్య ఉండడంతో ప్రైవేట్ ఆపరేటర్లచే దరఖాస్తులను ఆన్‌లైన్ చేయించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు ప్రతీ దరఖాస్తుకు రూ.15ఇస్తామని మొదటగా ప్రకటించారు. అనంతరం రూ.10తగ్గించి రూ.5మాత్రమే ఇస్తామన్నారు. అయినప్పటికీ ప్రైవేట్ ఆపరేటర్లు ప్రజాపాలనలో తాము భాగస్వాములు కావాలనే ఉత్సాహంతో దరఖాస్తులను ఎంట్రీచేశారు. ఎంట్రీ ప్రక్రియ కొనసాగినన్ని రోజులు అధికారులు ప్రతీ నిమిషం పర్యవేక్షిస్తూ టార్గెట్ పూర్తి చేయాలంటూ ఒత్తిడిచేస్తూ గడువులోపు ఎంట్రీలను పూర్తి చేయించారు. చివరి రోజు నాటికి చార్జీలను చెల్లిస్తామని ప్రతీరోజు పేర్కొనే వారు కానీ ఎంట్రీ ప్రక్రియ పూర్తయి సుమారు 50 రోజులు గడుస్తుండగా ప్రైవేట్ ఆపరేటర్ల ఎంట్రీల ఆధారంగానే అర్హులను ఎంపికచేసి అభయ హస్తం పథకాల లబ్ధిని కూడా ప్రభుత్వం అందిస్తున్నది. ప్రతీ పథకం ప్రారంభానికి ముందు పాలకులు, అధికారులు హంగామా చేస్తూ ఆపరేటర్లకు చెల్లించాల్సిన చార్జీలను మాత్రం విస్మరిస్తుండడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.


యువతే అధికం

ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసిన ఆపరేటర్లలో యువతే అధికంగా ఉంది. ప్రభుత్వ కార్యాకలాపాల్లో విధులు నిర్వహించాలనే ఉత్సాహంతో పలువురు యువకులు సొంత కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల ద్వారా ఎంట్రీ ప్రక్రియను పూర్తిచేశారు. ఆ రెండు లేని వారు తమకు తెలిసిన వారి వద్ద నుంచి తాత్కాలికంగా సర్దుబాటు చేసుకున్నారు. మరికొంత మంది గృహిణులు ఇంట్లో ఉంటూనే ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తిచేశారు. ఇంటర్నెట్ సౌకర్యంలేని వారు తాత్కాలికంగా సెల్‌ఫోన్లలో నెట్ బ్యాలెన్స్ రీచార్జ్ చేసుకోగా మరికొందరు వైఫై అందుబాటులో ఉన్న బంధువుల ఇళ్ల నుంచి కూడా దరఖాస్తులను ఎంట్రీచేశారు. ఒక్కో దరఖాస్తుకు సంబంధించి సుమారు 25 వివరాలను సుమారు 10 నిమిషాలపాటు ఎంట్రీ చేసినప్పటికీ వారికి రావాల్సిన స్వల్ప చార్జీలు కూడా నేటికీ అందలేదు.

ప్రజాపాలన దరఖాస్తులు ఇలా

జిల్లా	దరఖాస్తులు	ఆపరేటర్లకు రావాల్సిన చార్జీలు
నల్లగొండ	6,11,853	రూ.30,59,265
సూర్యాపేట	3,11,107	రూ.15,55,535
భువనగిరి	2,18,507	రూ.10,94,035
మొత్తం	**11,41,767**	**రూ.57,08,835**


చార్జీలను వెంటనే చెల్లించాలి



ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసిన ప్రైవేట్ ఆపరేటర్లకు వెంటనే చార్జీలను చెల్లించాలి. మామిత్ర బృందం సుమారు 600లకు పైగా దరఖాస్తులను ప్రజాపాలన తెలంగాణ పోర్టల్‌లో నమోదు చేశాం. చార్జీల రూపంలో వచ్చే మొత్తంతో చిన్నపాటి అవసరాలు తీరుతాయనుకున్నాం. కానీ ఇప్పటివరకు అధికారులు, ప్రభుత్వం చార్జీల చెల్లింపుపై మౌనం పాటిస్తుండడం ఆశ్చర్యంగా ఉంది. ఆపరేటర్లందరూ నిరుద్యోగులు, గృహిణులే అధికంగా ఉన్నారు. ఇప్పటికైనా చార్జీలను చెల్లించాలి.

జాలిగం శివప్రసాద్, ప్రైవేట్ ఆపరేటర్, భువనగిరి

నిధులు రాగానే చార్జీలు చెల్లిస్తాం



భూదాన్‌పోచంల్లి మండలంలో 11,358 ప్రజాపాలన దరఖాస్తులను ఆపరేటర్లు ఎంట్రీ చేశారు. కానీ వారికివ్వాల్సిన చార్జీలను ప్రభుత్వం ఇంతవరకు విడుదల చేయలేదు. చార్జీల కోసం ఆపరేటర్లు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నిధులను విడుదల చేసిన వెంటనే చార్జీలను చెల్లిస్తాం. దరఖాస్తులను ఆపరేటర్లు నిర్దేశిత గడువులోపు నమోదు చేయడంతోనే అర్హుల ఎంపిక సులువైంది.

రాపర్తి భాస్కర్, పోచంపల్లి ఎంపీడీవో.

దొడ్డి కొమరయ్య జీవితం భావి తరాలకు ఆదర్శం



మోత్కూరులో దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య, తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్

● ప్రభుత్వ విప్ అయిలయ్య, తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు, మార్చి 5: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమరయ్య జీవితం భావి తరాలకు ఆదర్శమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మోత్కూరులో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని మంగళవారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆయన ముందుండి పోరాడి, దొరలు, భూస్వాముల గూండాల దాడిలో అమరుడయ్యారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంతో పాటు అనేక పోరాటాలకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే స్ఫూర్తి అన్నారు. దొడ్డి కొమురయ్య తిరుగుబాటుకు చిహ్నంగా నిలిచారన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, తెలంగాణ రాష్ట్ర సాధనకు సాగిన తొలి, మలిదశ ఉద్యమాల్లో అమరులైన వీరుల త్యాగాలు మరువలేనివన్నారు. సుదీర్ఘ కాలం పోరాడి సాధించుకున్న తెలంగాణ గత తొమ్మిదిన్నర ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధికి నోచుకోక దోపిడి గురయ్యిందన్నారు. తెలంగాణలో మోత్కూరు ప్రాంతం చాలా వెనుకబడి ఉందని, ఈ ప్రాంత అభివృద్ధికి తాము కృషి చేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఈ ప్రాంత అభివృద్ధికి సహకరిస్తానని మాట ఇచ్చారన్నారు. కురుమల కోరిక మేరకు మోత్కూరులో వారికి స్థలం కేటాయింపజేసి, భవనం నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో కెవైసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గొరిగె నర్సింహ, ఉపాధ్యక్షుడు కుండె వెంకటేష్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు వంగాల సత్యనారాయణ, గుండగోని రామచంద్రు, సోమిరెడ్డి, అవిలిమల్లు పాల్గొన్నారు.

వడపర్తి కత్వలోకి కాళేశ్వరం నీటిని వదలాలి



అయిలయ్యకు వినతిపత్రం అందజేస్తున్న వివిధ గ్రామాల ప్రజలు

భువనగిరి రూరల్: బొమ్మల రామారం మండలం చౌదర్‌పల్లిలో చెరువు నుంచి కాళేశ్వరం నీరు అలుగుపోస్తోందని, ఆ నీటిని వడపర్తి కత్వలోకి వచ్చే విధంగా కృషి చేయాలని తాజ్‌పూర్, మన్నెవారిపంపు గ్రామస్తులు మంగళవారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు వినతిపత్రం అందజేశారు. వడపర్తి చెరువు నిండినట్లయితే మన్నెవారిపంపు, తాజ్‌పూర్ గ్రామాల పరిధిలోని రైతులకు సాగు చేసుకునే అవకాశం ఉందని, భూగర్భజలాలు పెంపొందే అవకాశం ఉందని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్ జిల్లా నేత రాకల శ్రీనివాస్, మన్నెవారిపంపు మాజీ సర్పంచ్ బోయిన పాండు ఉన్నారు.

దివీస్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్ మల్లేష్‌యాదవ్

చౌటుప్పల్ మునిసిపాలిటీ/ భువనగిరి అర్బన్, మార్చి 5: చౌటుప్పల్ మునిసిపల్‌లోని లింగోజిగూడెం గ్రామ పరిధిలో ఉన్న దివీస్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆరెగూడెం మాజీ సర్పంచ్ జాల మల్లేష్ యాదవ్ జిల్లా కలెక్టర్‌కు, పీసీబీ నల్లగొండ రిజనల్ అధికారికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివీస్ పరిశ్రమ కాలుష్యం వల్ల పంటలు పండడం లేదని అన్నారు. భూగర్భ జలాలు పూర్తిగా కలుషితం అయ్యి నీటి కాలుష్యంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గ్రామంలో తాగడానికి గ్రామపంచాయతీ నుంచి వేసిన బోర్లు సైతం కెమికల్ నీళ్లతో నిండిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి దివీస్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో గ్రామ ప్రజలను, రైతులతో కలిసి ఆందోళన చేపడతామని తెలిపారు.

రైతుబంధు అందరికీ అందించాలి: సీపీఎం

భూదాన్‌పోచంపల్లి, మార్చి 5 : రైతు బంధు అందరికీ అందించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం మండల కార్యదర్శి వర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా అధికారం చేపట్టిన ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు యాసంగి సీజన్ పంటకు సంబంధించిన రైతుబంధు నేటికీ అందరికీ ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన హామీల అమలును స్వాగతిస్తున్నామని, పేదలకు అనేక విధాలుగా ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. అర్హులైన వారికి రేషన్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి పగిల్ల లింగారెడ్డి, నాయకులు కోట రాంచంద్రారెడ్డి, మంచాల మధు, బుచ్చిరెడ్డి, విష్ణు పాల్గొన్నారు.

రైతులపై అటవీ అధికారుల వేధింపులు మానుకోవాలి: టీడీపీ

సంస్థాన్ నారాయణపురం మార్చి5: రాచకొండ రైతులపై అటవీ అధికారుల వేధింపులు మానుకోవాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య యాదవ్ అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండలం రాచకొండ ప్రాంతంలో ఎండుతున్న వరి పంటలను మంగళవారం టీడీపీ నాయకులు పరిశీలించారు. రైతులు పంటలను సాగు చేసుకునేందుకు ఆటంకాలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ఐలయ్య ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఏర్పుల సుదర్శన్, నెట్టు శ్రీకాంత్, ముత్యాల విజయ్‌కుమార్, కొలను వేణుగోపాల్ రెడ్డి, నల్లబోతు భారతమ్మ, గోపరాజు బిక్షం, వలిగొండ మాధవ్, వావిళ్ళ సత్తయ్య, నరసింహ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు

మోత్కూరు, మార్చి 5: మోత్కూరు మునిసిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ 6వ వార్డు కౌన్సిలర్ వనం స్వామి, 12వ వార్డు కౌన్సిలర్ కూరెల్ల కుమారస్వామి మంగళవారం స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారిద్దరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈనెల 4న బీఆర్ఎస్ కౌన్సిలర్ల మద్దతుతో కాంగ్రెస్ కౌన్సిలర్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి మునిసిపల్ చైర్ పర్సన్‌గా ఎన్నికైన విషయం తెలిసిందే. ఎన్నిక సందర్భంగా వారు ఆమెకు మద్దతునిచ్చారు. మునిసిపాలిటీలో మొత్తం 12 మంది కౌన్సిలర్లు ఉండగా ఇప్పటి వరకు బీఆర్ఎస్‌కు 8 మంది కౌన్సిలర్లు, కాంగ్రెస్‌కు నలుగురు కౌన్సిలర్లు ఉండేవారు. తాజా బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఇద్దరు కాంగ్రెస్‌లో చేరడంతో మునిసిపాలిటీలో కాంగ్రెస్ కౌన్సిలర్ల బలం ఆరుకు పెరిగింది. రెండు పార్టీలకు సమానం బలం ఉన్నట్టయ్యింది. కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి, కాంగ్రెస్ కౌన్సిలర్లు కారుపోతుల శిరీష, మలిపెద్ది రజిత, ఎర్రవెళ్లి మల్లమ్మ కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షుడు వి.సత్యనారాయణ, రామచంద్రు ఉన్నారు.

భూతగాదాలతో ఘర్షణ: కర్రలతో దాడి

భువనగిరి రూరల్, మార్చి 5: భూతగాదాల ఘర్షణ నేపథ్యంలో కర్రలతో దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా... భువనగిరి మండలం తుక్కాపూర్‌కు చెందిన జిల్లా శ్రీశైలం సమీప బంధువులు జిల్లా సత్తయ్య వ్యవసాయ బావికి వెళ్లే దారి (తోవ)కి సంబంధించి వివాదం నెలకొంది. అయితే శ్రీశైలం అతని బావి వద్దకు వెళుతుండగా సత్తయ్య అతని కుమారుడు మహేష్ కర్రలతో శ్రీశైలం తలపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడు శ్రీశైలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్తయ్య అతని కుమారుడు మహేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

బృహత్ ప్రకృతి వనం దగ్ధం

గుండాల, మార్చి5: మండలంలోని సీతారాంపురం గ్రామంలో మంగళవారం ప్రమాదవశాత్తు బృహత్ ప్రకృతి వనానికి నిప్పంటుకోవడంతో గ్రామ పంచాయతీ వర్కర్లు సంఘటన స్థలానికి చేరుకుని ఆర్పివేశారు. బృహత్ ప్రకృతి వనం 10ఎకరాలు ఉండగా నిర్వహణ సరిగా లేకపోవడంతో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, గడ్డి మొక్కలు మొలిశాయి. దీంతో ఎండిన గడ్డికి నిప్పంటుకుని గడ్డితో పాటు 3ఎకరాల వరకు చెట్లు దహనమయ్యాయి.

పత్తి గోదాములో కొనసాగుతున్న సహాయక చర్యలు

- **6500 పత్తి బేళ్లు అగ్నికి ఆహుతి**
- **సుమారు రూ.25కోట్ల ఆస్తి నష్టం**
- **అదుపులోకి వస్తున్న మంటలు**



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

వలిగొండ, మార్చి 5: మండలంలోని టేకుల సోమారం గ్రామ పరిధిలో చిరాగ్ గోదాములో నిల్వ చేసిన సీసీఐ పత్తి సోమవారం ప్రమాదానికి గురై మంటలు ఎగిసి పడి మంగళవారం నాటికి తగ్గుముఖం పట్టింది. సీసీఐ, సీడబ్ల్యూసీ అధికారులు, అగ్ని మాపక సిబ్బంది సహాయక చర్యలను తీవ్రతరం చేశారు. పత్తిని రక్షించడానికి ఎక్స్‌కవేటర్, కూలీల సహాయంతో గోదాము నుంచి బేళ్లను బయటకు తెచ్చారు. అగ్ని ప్రమాదం వల్ల సుమారుగా 6,500 బేళ్ల పత్తి అగ్నికి ఆహుతి అయ్యింది. సుమారుగా రూ.25కోట్లు నష్టం వాటిల్లినట్లు సీసీఐ అధికారి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. 4వ నెంబర్ గోదాములో సీ బ్లాక్‌లోని పత్తి పూర్తిగా దగ్ధం కాగా ఆ మంటలు మిగిలిన



పత్తి బేళ్లను లారీలోకి ఎక్కిస్తున్న సిబ్బంది

బ్లాక్‌లకు వ్యాపించకుండా కట్టడి చేశారు. మొగిలిన బ్లాక్‌లోని నిల్వ చేసిన పత్తిని ఎక్సకవేటర్లతో లారీల్లోకి ఇక్కించి రఘునాథపల్లి గోదాముకు తరలించారు. సుమారుగా 1600 బేళ్ల పత్తిని తరలించారు. ఈ నిల్వచేసిన పత్తిని 2023-24 సీజన్‌కు సంబంధించింది. చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఆర్ఐ కరుణాకర్‌రెడ్డి, ఎంపీవో కేదారీశ్వర్లు సందర్శించారు. క్లూస్ టీం అధికారులు హబీబ్, నర్సింహ, గోపాల్‌లు పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ప్రాథమిక విచారణను చేపట్టారు.

నిరంతరంగా శ్రమిస్తున్న ఫైర్ సిబ్బంది

గోదాములో దగ్ధమవుతున్న పత్తి వల్ల మంటలను ఆర్పివేయడానికి సోమవారం నుంచి అగ్నిమాపక సిబ్బంది నిరంతరంగా రాత్రి పగలు శ్రమిస్తున్నారు. పలు ప్రాంతాల నుంచి ఫైర్ ఇంజన్లను తీసుకువచ్చి మంటలను ఆర్పుతున్నారు.

పేదల పెన్నిధి కాంగ్రెస్ ప్రభుత్వం

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



ఎల్‌వోసీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, మార్చి 5: పేదలకుపెన్నిధిగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, పేదలకు అమలు చేస్తు న్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దంతూరు గ్రామానికి చెందిన బోదాసు అంజమ్మకు మంజూరైన రూ.2,25,000 ఎల్‌వోసీ చెక్కును భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బాధి త కుటుంబానికి అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రకటించిన ఆరు గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేసి తీరుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతి పాలనకు ప్రజలు చరమగీతం పాడారని, రానున్న పార్లమెంటు ఎన్నికల్లోనూ ప్రజాపాలన అందించే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పాక మల్లేష్‌యాదవ్, దంతూరు మాజీ సర్పంచు దోటి కుమార్‌యాదవ్, మాజీ ఉపసర్పంచు శ్రీను, నాయకులు సిద్దగోని మల్లయ్యగౌడ్ పాల్గొన్నారు.

రూ.49.49 కోట్ల మునిసిపల్ బడ్జెట్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

● పట్టణ ప్రగతికి దోహదపడే బడ్జెట్: చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరి టౌన్, మార్చి 5: భువనగిరి మునిసిపల్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ.49.49 కోట్ల అంచనా బడ్జెట్‌ను మునిసిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం జరిగిన కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో రూ.49.49 కోట్ల బడ్జెట్‌ను అధికారులు ప్రతిపాదించారు. అనంతరం బడ్జెట్ ఆదాయ వ్యయాలు, ప్రతిపాదనలపై చర్చించిన కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మాజీ వైస్‌చైర్మన్ చింతల కిష్టయ్య మాట్లాడుతూ అవిశ్వాస రాజకీయాల పేరిట భువనగిరి కౌన్సిల్ ప్రతిష్టను కొద్ది మంది కౌన్సిలర్లు దిగజార్చారన్నారు. బీఆర్ఎస్ సభ్యుడు ఏవీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, గత బీఆర్ఎస్ పాలక పక్షం ప్రతిపాదించి ప్రారంభించిన అభివృద్ధి పనులను కొనసాగించాలన్నారు. 19వ వార్డు పరిధిలో పార్కు కోసం కేటాయించిన స్థలంలో జరుగుతున్న ఆక్రమణలను నియంత్రించాలన్నారు. బీజేపీ సభ్యుడు రత్నపురం బలరాం మాట్లాడుతూ గతానికంటే నేడు మెరుగైన పాలన, అభివృద్ధి సాగే అవకాశాలు ఉన్నాయన్నారు. చైర్మన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కౌన్సిల్ ఆమోదించిన బడ్జెట్ పట్టణ ప్రగతికి దోహదపడుతుందన్నారు. ప్రజల మేలే లక్ష్యంగా పురపాలన సాగుతుందని ఇందుకు పార్టీలకు అతీతంగా సభ్యులందరూ సహకరించాలన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్ మాయ దశరథ, కమిషనర్ పి.రామాంజుల్‌రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

బడ్జెట్ ఇలా..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మునిసిపల్ కౌన్సిల్ రూ.49.49 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించింది. ఈ మేరకు బడ్జెట్‌లో ప్రారంభ నిల్వగా రూ.2,77,72,000, వివిధ పద్దుల ద్వారా వార్షిక ఆదాయం రూ.46,88,80,000, ఉండనుంది. దీంతో మొత్తం నిల్వగా రూ.49,66,52,000గా బడ్జెట్ ఉండనుండగా వివిధ అభివృద్ధి పనులు, చెల్లింపులకు రూ.49,49,75,000 వ్యయం కానుండగా ముంగింపు నిల్వ రూ.16.77లక్షలు మిగులుగా ఉండనుందని అధికారులు పేర్కొన్నారు.

ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



టాలెంట్ టెస్టులో అధిక మార్కులు సాధించిన విద్యార్థికి షీల్డు అందిస్తున్న ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి

మోత్కూరు, మార్చి 5: విద్యార్థులు ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని స్థానిక ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబర్చిన (అధిక మార్కులు సాధించిన) విద్యార్థులకు స్థానిక సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చైతన్యంతో మెలగాలన్నారు. ఇష్టంతో కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుతారన్నారు. ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్టు నిర్వహించడంతో విద్యార్థుల్లో పరీక్షలంటే ఉన్న భయం పోతుందని, మెలకువలు తెలుస్తాయన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు లోనై భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దన్నారు. టాలెంటు టెస్టులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు చిత్తలూరి వినయ్, సాత్వికరెడ్డి, శ్రీజ, శృతికి బహుమతులు అందించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఇంజ ప్రశాంత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సెయింట్ ఆన్స్, డివైన్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు పసల మరియన్న, బాలరాజు, మర్రి అనిల్‌కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

వలిగొండ, మార్చి 5: విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెర్క జగన్నాథం మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ పబ్బు నారాయణ తెలిపారు. మంగళవారం యూత్ ఫర్ సేవా సహకారంతో జగన్నాథం మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గోకారం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, జామెట్రి బాక్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ సమాజంలో ఉన్న అసమానతలు తొలగిపోవాలన్న విద్యాశాల అవసరమని అన్నారు. విద్యార్థులు చెడు మార్గాలకు లోనుకాకుండా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ ఫర్ సేవ ప్రతినిధులు అరవింద్, జగన్నాథం ట్రస్ట్ సభ్యులు వెంకటేశ్, రాజయ్య, సురేందర్, సురేష్, రామస్వామి, జంగయ్య, పాండు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్ మునిసిపాలిటీ, మార్చి 5: రాబోయే వేసవి దృష్ట్యా చౌటుప్పల్ మునిసిపాలిటీ పరిధిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు తెలిపారు. మంగళవారం చౌటుప్పల్ మునిసిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అధ్యక్షతన జరిగింది. పట్టణ పరిధిలోని ఏ వార్డులోనూ నీటి సమస్య రాకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా ప్రైవేట్ వ్యక్తుల బోరుబావులు ఉంటే గుర్తించి, నిర్వహణ చేసుకునే విధంగా ప్రయత్నం చేయాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిపారు. సమావేశంలో మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కమిషనర్ ఎన్.వెంకటేశ్వరనాయక్, సీపీఎం, బీజేపీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ గోపగోని లక్ష్మణ్, పోలోజు శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలి



ధ్వంసమైన రోడ్డును చూపుతున్న సీపీఎం నాయకులు

రామన్నపేట, మార్చి 5: రామన్నపేట-పల్లెపహడ్ రూట్ గుంతలమయమైన రోడ్లతో ప్రయాణాలు నరకయాతనగా మారుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం అన్నారు. దుబ్బాక గ్రామ శివారులో ధ్వంసంమై ప్రమాదాలకు కారణమవుతున్న బీటీ రోడ్డును మంగళవారం సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో పరిశీలించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కురిసిన అకాలవర్షాల కారణంగా రోడ్లు గుంతలమయమై ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. రామన్నపేట నుంచి పల్లెపహడ్ రోడ్డు అధ్వానంగా మారిందన్నారు. ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతు చేయకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం శాఖ కార్యదర్శి గుండాల భిక్షం, నాయకులు గట్టు నర్సింహ, భూడిద భిక్షం, గంటెపాక శివకుమార్, గట్టు సుందర్, వేముల మల్లేశం, తెల్కలపల్లి యాదగిరి, గుండాల అనిల్, కంబాలపల్లి శ్రీశైలం, మహేష్ పాల్గొన్నారు.

మహా పంచాయత్‌ను జయప్రదం చేయాలి: ఇఫ్టూ

ఆలేరు రూరల్, మార్చి 5: దేశరాజధాని ఢిల్లీలో ఈ నెల 14న జరిగే మహా పంచాయత్‌ను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆలేరులో జరిగిన ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు సంవత్సరాల క్రితం రైతాంగానికి ప్రధాని మోదీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం అప్రజాస్వామికమన్నారు. రైతులకు సమగ్ర రుణమాఫీని అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని, విద్యుత్ ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచనను విరమించుకోవాలన్నారు. ప్రజా, కార్మిక రైతు విధానాలను వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరిగే మహాపంచాయత్‌ను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, సుదర్శన్, శ్రీకాంత్, కుమార్, వెంకటేష్ ఉన్నారు.

అన్యమత ప్రచారాన్ని నిషేధించాలి: వీహెచ్‌పీ

చౌటుప్పల్ టౌన్/ సంస్థాన్‌నారాయణపురం, మార్చి 5: జిల్లాలోని రాచకొండ ప్రాంతంలో నిర్వహించే మహా శివరాత్రి ఉత్సవాల్లో గోవధ, అన్యమత ప్రచారాన్ని నిషేధించాలని వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు కొంతం అనంతరెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయంలో అనంతరెడ్డి బృందం వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ రాచకొండ ప్రాంతంలో శతాబ్దాల నుంచి ధార్మిక, ఆధ్యాత్మిక, చారిత్రాకంగా ఎంతో ప్రసిద్ధి పొందిన ప్రాంతమని ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలో అన్యమత ప్రచారంతో పాటు గోవధ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో వీహెచ్‌పీ నాయకులు గరిసే శేఖర్, ఐతరాజు స్వామి, పాశం వెంకటేశం పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

చౌటుప్పల్ టౌన్ : భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు ప్రతీ ఒక్కరూ కంకణబద్ధులై పని చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్నెం శివకుమార్ కోరారు. పట్టణంలో బీజేపీ మునిసిపాలిటీ, రూరల్ మండలాల నూతన కమిటీల ఎన్నికల సంయుక్త సమావేశం జరిగింది.

వలిగొండ: కేంద్రంలో తిరిగి అధికారం చేపట్టబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ మండల ఇన్‌చారి చందా మహేందర్‌గుప్త తెలిపారు. మండల కేంద్రంలో ముఖ్యకార్యకర్తల సమావేశం సీఎస్‌రెడ్డి కాంప్లెక్స్‌లో నూతన అధ్యక్షుడి ఎన్నికపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆశావాహుల పేర్లను నమోదు చేసుకున్నారు.

భువనగిరి టౌన్: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని యువత మరోమారు కోరుకుంటోందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్ అన్నారు. భువనగిరిలో జరిగిన బీజేవైఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రధాని మోదీ భారీ చేయూతనిచ్చారన్నారు.

చౌటుప్పల్ టౌన్ : గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు టోర్నమెంట్స్ దోహదం చేస్తాయని బీజేపీ భువనగిరి పార్లమెంట్ కన్వీనర్ బందారపు లింగస్వామి అన్నారు. చౌటుప్పల్ పట్టణంలో బీఎల్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతి సాధించిన చిట్యాల స్వామి 11 జట్టు, ద్వితీయ బహుమతి సాధించిన నాగన్ పల్లి జట్లలకు జ్ఞాపికలను అందజేశారు.

మోత్కూరు : పెండింగ్ వేతనాలు చెల్లించి, ఆదుకోవాలని మండలంలోని 10 గ్రామ పంచాయతీల సిబ్బంది మోత్కూరు ఎంపీడీవో పి.మనోహర్‌రెడ్డికి, ఎంపీవో రావూఫ్ అలీకి వినతి పత్రాలు అందజేశారు. ఆరు మాసాలుగా తమకు వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ అవసరాలకు నానా అగచాట్లు పడుతున్నామని పాల్గొన్నారు.

● లారీ డ్రైవర్ల పాలిట శాపంగా మారిన హిట్ అండ్ రన్ నల్ల చట్టాన్ని కేంద్రప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండి.ఇమ్రాన్ డిమాండ్ చేశారు. మోత్కూరులో సుమారు 40 మంది లారీ డ్రైవర్లు ఏఐటీయూసీలో చేరగా, ఆయన వారికి ఏఐటీయూసీ కండువాలు కప్పి సంఘంలోకి ఆహ్వానించారు.

వలిగొండ : ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన పథకంతో ప్రజలకు అనేక ప్రయోజనం కలుగుతుందని ఎన్‌డీసీసీబి బ్యాంక్ మేనేజర్ అలీ షరీఫ్ తెలిపారు. మండలంలోని అరూరు గ్రామంలో నాబార్డ్ సౌజన్యంతో నగదు రహిత లావాదేవీలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రామన్నపేట: మండలంలోని నిదానపల్లి గ్రామంలో మల్లన్నగుట్టపై వెలసిన భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి (చిన్న శ్రీశైలం) బ్రహ్మోత్సవాలు భాగంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆయన నివాసంలో భ్రమరాంబ మల్లిఖార్జున బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను మంగళవారం విడుదల చేశారు. మహాశివరాత్రి పురస్కరించుకొని స్వామివారు నిదానపల్లి నుంచి మల్లన్న గుట్టపైకి బయలుదేరుతారని, శనివారం రాత్రి 11 గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతుందని, తెల్లవారుజామున 6.30 గంటలకు అగ్నిగుండాలు జరుగుతాయని మల్లన్నగుట్ట ఉత్సవ కమిటీ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఏ నాగిరెడ్డి, బేతోజు సత్యనారాయణశాస్త్రి సిద్ధాంతి తెలిపారు.

మోత్కూరు : 2019-20 విద్యా సంవత్సరంలో విద్యా వలంటీర్లుగా పనిచేసిన వారిని 2024 జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభించగానే ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్థానాల్లో తీసుకునేందుకు కృషి చేస్తానని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేషం తమకు హామీ ఇచ్చారని విద్యా వలంటీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.సత్తయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.సైదులు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తమను విద్యా వాలంటీర్లుగా విధుల్లోకి తీసుకోవాలని తాము మంగళవారం ఆయనకు వినతి పత్రం అందజేయగా ఆయన పై విధంగా స్పందించారన్నారు. బకాయి వేతనాలు కూడా త్వరలోనే చెల్లిస్తామన్నారని చెప్పారు. జి.కవిత, ఎం.యాకయ్య పాల్గొన్నారు.

మోత్కూరు : మోత్కూరులో సుమారు 35ఏళ్లుగా రేషన్ డీలర్‌గా సేవలు అందిస్తున్న డీలర్ పోచం పుల్లయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలుగు రాజయ్య, గౌరవాధ్యక్షుడు మన్నె యాదగిరి, ఉమాదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, నాయకులు కల్లూరి మల్లేశం, బొల్లు యాదగిరి, గుండు వెంకటనర్సు, వివిధ పార్టీల నాయకులు ఆయన భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సంస్థాన్ నారాయణపురం: డిప్యూటేషన్ పేరుతో పాఠశాలలకు సరిగా వెళ్లకుండా వేతనాలు తీసుకుంటున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దొంతగోని అమరేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ మండలాలోని పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న పాఠశాలలకు వెళ్లారని ఆయన అన్నారు. అక్కడ కూడా సక్రమంగా విధులు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నెల నెల వేతనాలు తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోకుండా జిల్లా శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు.

మోత్కూరు : మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మోత్కూరులో ఈ నెల 9, 10 తేదీల్లో నియో స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల కరపత్రాలను మంగళవారం ఆయన విడుదల చేసి మాట్లాడారు.